# ఓ కథ కథ

ఫణీ! నీ కథొచ్చింది"

"ఏ కథ?"

"విడాకులిచ్చుకున్న ఓ అమ్మాయిని ప్రేమించి ఓ బ్యాంక్ ఉద్యోగి పెళ్లిచేసు...."

"ఓ! ఆ కథా!"

"ఊఁ... ఆ కథే!"

"ఎప్పుడొచ్చింది?"

"ఈ రోజే!"

"ఎందులో?"

"పోస్ట్‌లో...."

"ఏ పత్రిక.. ఓ.. ఐసీ!"

దిగాలు పడ్డాడు మానవుడు. ఎంత కట్టుకున్న వాడైనా కాస్త వేళాకోళం చెయ్యకుండా ఉండలేకపోయేను. నేను కూడా దిగులు పడినట్లు తెలిస్తే మరింత నిరుత్సాహ పడతాడని కాస్త మొహానికి చిరునవ్వు పులుముకున్నాను. మా పెళ్లయిన ఈ రెండేళ్లలోనూ తీరుబడి చేసుకుని నాలుగు కథలు రాశాడు. నేను రచయిత్రిని కాను, విమర్శకురాల్నీ కాను. సగటు పాఠకురాలిగా, నాకు ఫణి కథలుబాగానే వుంటాయి. అతని కథల్లో న్యాయం, ధర్మం చివరికి గెలుస్తాయి. పత్రికల అభిరుచికి విభిన్నంగా వుండటం వల్లనేమో, ఇంతవరకూ ఏ పత్రికకీ ఫణి కథలు ప్రచురించే అదృష్టం కలగలేదు.

మా పెళ్లికి ముందూ, మాటల సందర్భంలో కథలు తన హాబీ అన్నాడు. ఏ పత్రికలోనైనా అతని కథ పడిందా అని అడిగితే 'విశ్వశాంతి' అనే పత్రిక ఒకటిచ్చేడు. అసలలాంటి పత్రికున్నట్టే నాకు తెలీదు. కథ బాగానే వుంది కాని ఆ పత్రికే చూడ్డానికి బాగాలేదు. సైజు కూడా చిన్నది. సినిమా పాటల పుస్తకంలాగుంది. తర్వాత తెలిసింది. దాని సంపాదకుడు మాజీ సుప్రసిద్ధ రచయితనీ, మంచివాడనీ, పేరు సదాశివరావనీ,

తన జీవితాశయాల్నీ, జీవితగాథనీ సీరియల్‌గా ప్రచురిస్తూ ఔత్సాహిక రచయితల్నీ రచయిత్రుల్నీ ప్రోత్సహించడానికే తనశేష జీవితాన్ని అంకితం చెయ్యాలని ఆ పత్రికని నడుపుతూ సాహిత్య సేవ చేస్తున్నాడని. ఆ పత్రిక ప్రతులు బయట దొరకవుట. చందాదారులకే పంపుతారట. సర్వ సాధారణంగా చందాదారుల కథలే అందులో వేస్తారుట.

మేమిద్దరం ఉద్యోగాలు చేసుకుంటున్నా, నాకున్నంత తీరుబడి ఫణికి లేదు. పాపం! ఎప్పుడూ పని తొందరే! అయినా తీరిక దొరికినప్పుడల్లా ఏ సాహిత్య సభకో వెళ్లడం, రచయితల్ని పరిచయం చేసుకోవడం, ఎవర్నో ఒకర్ని ఇంటికి ఆహ్వానించి ఆతిథ్యం ఇవ్వడం పరిపాటే. అయితే వొచ్చిన ప్రతీ రచయితా తన కథల ఔచిత్యాన్ని గురించి బాజా వాయించుకునేవాడే కాని ఫణి కథలు చదివి సలహాయిచ్చే ఉత్సాహం, ఔదార్యం ఎవరిలోనూ కనబడలేదు.

★ ★ ★

ఓసారి సదాశివరావుగారు మా ఇంటికొచ్చేరు. తన పత్రికకి అనుబంధంగా 'సాహితి సంచారి' అనే పుస్తకప్రచురణ సంస్థ వుందనీ, వెయ్యి రూపాయలు కట్టి అందులో సభ్యుడయితే ఉత్తరోత్రా ఫణి రాసిన కథలనన్నీ ఓ సంకలనం క్రింద ప్రచురించటానికేవిధంగా ఉపకరిస్తుందో వివరంగా చెప్పి, ఫణి పట్టుదల నభినందించి, నిరుత్సాహపడకుండా యింకా కథలు రాయమని మనసారా ప్రోత్సహించాడు.

"అంకుల్! ఫణి గొప్ప రచయిత కాకపోవచ్చు. కాని ఇతను రాసిన కథలకంటే నాసిరకం కథల్ని అప్పుడప్పుడు చూస్తున్నాం" అన్నాను.

"కావచ్చు. కాస్త పేరున్న రైటర్ కథలకి గిరాకీ వుండటం సహజం. అలా అని కొత్త వాళ్లమంచి కథల పట్ల పత్రికలకి నిర్లక్ష్య భావం వుంటుందనుకోవడం సబబుకాదు."

"పేరున్న రచయితల కథల్లో బాగాలేని కథలెన్నో చూపెడతాను" అన్నాను.

"అదీ కాదనను. అయితే అనుభవం వున్న రచయితలు సాధారణంగా సమకాలీన పౌర జీవితానికి సంబంధించిన కథా వస్తువులనే ఎన్నుకుని...."

"ఫణి ఎంచుకున్న కథా వస్తువుల లాంటివి కాదంటారా!"

"కాని కథా వస్తువుని ఆవిష్కరించే కథా శిల్పం...."

"పోనీ ఫణి రాసిన ఏ ఒక్క కథనైనా ఏ విధంగా మలుపులు తిప్పి తిరిగి రాయాలో ఆ మెళుకువలు చెప్పండి అంకుల్" అన్నాను.

"అమ్మా! నాకిప్పుడంత ఓపిక లేదు. నేనో మంచి సలహా యిస్తాను. 'రచన' అనే మాసపత్రికుంది తెలుసా?"

"తెలుసు. 'ఆటా', 'తానా'లతో పరస్పర సహకార సంబంధాలున్న సంస్థ" అన్నాడు ఫణి.

"వాళ్లాఫీసు మా ఆఫీసుదార్లోనే" అన్నాను.

"ఆ పత్రికకి నీ కథ ఒకటి పంపు. నచ్చితే యథాతథంగా వేసుకుంటారు. కథనం ఆకర్షణీయంగా లేకపోయినా కథావస్తువు బాగుందనుకుంటే "సాహితీ వైద్యం" శీర్షిక కింద ఆ కథను విశ్లేషించి మంచి సూచనలిచ్చి ప్రోత్సహిస్తారు" అన్నాడాయన వెళ్లబోయే ముందు.

సదాశివరావు సలహా గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టున్నాడు ఫణి. అతని కృషి ఫలించి ఒకకథయినా పత్రికలోపడితే చూడాలని నాకూ ఆత్రంగా ఉంది.

"ఫణీ! ఏమిటో నీ కథా రచన ఓ ప్రహసనంలా తయారయింది. దాన్నే ఓ కథ కింద రాసి పంపకూడదూ!" అన్నాను, జాలిగా.

"యు ఆర్ రైట్. 'యురేకా'! మంచి అయిడియా. 'రచన'కే పంపుతాను" అన్నాడు నా భుజాలు పట్టుకు కుదుపుతూ.

★ ★ ★

అనుకోకుండా ఈ మధ్యనే మా మామయ్య కొడుకు, మల్లిక్, ప్రమోషన్ మీద ఈ వూరొచ్చేడు. పెద్ద ఆస్తికి వారసుడు, పైగా పై రాబడి పలుకుబడి పుష్కలంగా వున్న ప్రభుత్వోద్యోగం. మల్లిక్ మా అమ్మ వైపు చుట్టమైతే, అతని భార్యవసుంధర, మా నాన్న వైపు చుట్టం. వాళ్లకి రేఖ అనే పదోతరగతి పరీక్షా ఫలితాలకెదురు చూస్తున్న కూతురు. వసుంధరకీ వూళ్లో ఉద్యోగం చూసే ప్రయత్నంలో మా బావ నిమగ్నుడయ్యాడు. ఇంతకీ అసలు విషయమేమిటంటే మల్లిక్ కథలు రాస్తాడని, పత్రికల్లో పడుతూ వుంటాయని వసుంధర చెప్పింది.

"ఫణికి కూడా కథలు రాయడం సరదా, బావా! పత్రికలవాళ్లని ఆకర్షించే లాగ అతని కథలు ఎలా మలుచుకోవాలో నువ్వు కాస్త తర్ఫీదివ్వాలి" అన్నాను, మల్లిక్‌ని కలిసి మాటల సందర్భంలో.

"ఈ మహానుభావుడి దగ్గిరా తర్ఫీదు! ఈయన కథలు చదివితే స్నానం చేసినా ఆ పూట అన్నం సయించదు" అది వసు.

"అదేం" అన్నాను.

"అవి కథలు కావు. పతితులు భ్రష్టులు, బాధా సర్పదష్టుల హృదయాల నుంచి స్రవించే రుధిర ధారలు. దుఃఖం అవసరమనుకుంటే చదవొచ్చు" అంది వసుంధర.

"ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి అన్నట్టు... అసలు అంతటి స్పందన కలిగించిందంటే కథావస్తువులో వాస్తవిక వాదం, కథనంలో రసవత్తరమైన మాండలిక శైలి వుండటమే కారణం" అన్నాడు మల్లిక్ వసు మాటలకి నిరసనగా.

"వసు నీ ఎదురుగా ఇలా అంటుంది కాని, నిన్నూ, నీ కథల గురించీ తెగ పొగుడుతుంది. అందుకే ఫణికి నీ సలహా, సహాయం అవసరం అంటున్నాను" అన్నాను, అలాగే అంటాడేమోనన్న ఆశతో.

"కథ ఒక అజరామరమైన సాహిత్య ప్రక్రియ. హృదయస్పందనే దాని జన్మస్థానం. వాస్తవికతకు దర్పణంగా, కథనంలో శిల్పసౌరభ్యం...." అంటూ శంకరాభరణం శాస్త్రిలాగ ఓ చిన్నసైజు ఉపన్యాసం దంచేడు. యాతావాత నాకర్థమైందేమిటంటే, కథలు రాయడం, మామూలు మనుషులకి సాధ్యం కాదనీ, ఆ సృజనాత్మకశక్తి జన్మతః రావాలనీ మల్లిక్ అభిప్రాయం. ఫణి రావడానికి వీలు లేకపోవడం మంచిదయింది. లేకపోతే ఎలా స్పందించేవాడో! అసలు నేనెప్పుడూ మల్లిక్ కథలు చదవలేదు.

"ఈమధ్యేమీ నువ్వు కథ రాయలేదా?" అడిగేను.

"రాసేను. ఈసారి 'రచన'కు పంపిద్దామనుకుంటున్నాను. రెండు నెలల క్రితం ఇక్కడకొచ్చినప్పుడు ఏదో సాహిత్య సభలో నన్ను కలిసి ఆ పత్రిక సంపాదకుడువాళ్ల స్పెషల్ ఇష్యూకి ఓ కథ రాయమని బ్రతిమాలేడు." అన్నాడు.

"ఏదీ కథ, చూడొచ్చునా?" అన్నాను.

"చూడొచ్చు. అయితే ఓ షరతు. దాన్ని ఫెయిర్ కాపీ చేసివ్వాలి." అన్నాడు.

"అంతకంటేనా! ఫణి కథలు కూడా నేనే ఫెయిర్ చేసి పెడుతూవుంటాను. తీసుకురా" అన్నాను.

లేచి వెళ్లేడు.

"ఏమిటా కథ?" అడిగేను వసుంధరని.

"నాకు తెలీదు. నా అదృష్టం బాగుండి నా తెలుగు దస్తూరీ బాగుండదు. అంచేత ఫెయిర్ కాపీయింగ్ శిక్ష నాకు పడదు" అంది.

"ఏమిటి బావ రచనలు గురించి అలాగన్నావు!" అడిగేను.

"మీ బావ కథలకి ట్రేడ్‌మార్క్ దళితవాదం. పీడిత ప్రజలంటే ఎక్కడలేని దయా, సానుభూతీని, దళితుల్ని మేల్కొలిపి, స్వయంకృషితో, పట్టుదలతో వాళ్ల హక్కులు, అభ్యున్నతి సాధించే ఉద్బోధలు చెయ్యాలి కాని, వర్ణ భేదాలు, ఇంకా ఇప్పుడు కూడా, భూతద్దంలో చూపెట్టి వాళ్ల మధ్య మరింత అగాధాన్ని సృష్టించి జాతి సమైక్యతకి భగ్నం కలిగించే ఈ రకం కథలు నాకు నచ్చవు. అయినా ఈ మహా రచయిత దళితవాదమంతా కాగితాలకే పరిమితం. చేతల్లో ఏ బూర్జువాకి తీసిపోడు." అంది.

ఇద్దరం నవ్వుకున్నాం.

ఇంతలో బావొచ్చేడు.

"ఇదిగో కథ. నా దస్తూరీ సుమారుగా వుంటుంది. అయినా నా ఎదురుకుండా చదివెయ్యొకసారి. తుడుపులూ, కొట్టివేతలూ వుంటే సరిదిద్దుదాం" అన్నాడు.

యాంత్రికంగా చదివేను. ఏమిటో అతని మాటల్లాగే అతని కథ నాకర్థమై చావలేదు. కథ పేరు 'కథ కాని కథ'

"మరి ఎప్పుడు ఫెయిర్ చేసిస్తావు?" అడిగాడు.

"రేపు ఫెయిర్ చేసి, జిరాక్స్ కాపీ తీసి వుంచుతాను. నువ్వు 'రచన' సంపాదకుడికొక కవరింగ్ లెటర్ రాసియ్యి. ఆ కవరింగ్ లెటరూ, నీ కథ ఎల్లుండి స్వయంగా ఆ పత్రికాఫీసులో అందచేసి ఆ రసీదూ, జిరాక్స్ కాపీ ఎల్లుండి సాయంత్రం నీకు పట్టుకొచ్చిస్తాను. సరేనా!" అన్నాను.

"అబ్బో! థాంక్యూ వెరీమచ్. నీ రుణం ఎలాతీర్చుకోగలనో తెలియదు" అన్నాడు, కవరింగ్ లెటర్ రాసి తేవడానికి వెడుతూ. రుణం, పణం అంటాడు కాని అప్పుడైనా పోనీ ఫణిని తీసుకురా అతని కథలు చూసి సలహాయిస్తాననలేదు. ఇంక నేనడగదల్చుకోలేదు.

★ ★ ★

ఫణిరాసిన కథ హాస్యరసభరితంగా వుంది. నాకు నచ్చింది. ఇద్దరం కూడ బలుక్కుని దానికి 'ఓ కథ కథ' అని నామకరణం చేశాం. ఫెయిర్ కాపీయింగ్ నేనే చేసి స్వయంగా 'రచన'కి అందచేస్తానన్నాను. మా బావలాగే తనూ తన కథ 'ఓ కథకథ'ను ప్రచురణార్థం పరిశీలించవల్సిందిగా లెటర్‌హెడ్ మీదరాసి తెచ్చేడు.

★ ★ ★

"నీ కథొచ్చింది" అన్నాను ఫణితో.

"పోస్ట్‌లోనేనా?" అడిగేడు, అలవాటైన ధోరణిలో.

"కాదు 'రచన' పత్రికలో. ఇదిగో చదువుతున్నాను" అంటూ పత్రికలో పడిన ఫణి రాసిన కథలో భాగం చూపెట్టేను. ఆనందతో చదివి ఉక్కిరి బిక్కిరయ్యేడు. పత్రిక చేతికందివ్వగానే, నేననుకున్నట్టుగానే కెవ్వుమని అరిచేడు.

"వాటీజ్ దిస్! రచయిత పేరు మల్లిక్, కథ పేరు 'కథ కాని కథ', మరి కథ మాత్రం నాది. నా పేరుతో రాసిన కథ 'ఓ కథ కథ' ఏమయిందీ" అడిగేడు విస్మయాందోళనలతో.

"అది సాహితీ వైద్య శీర్షికలో శల్య పరీక్షకు శస్త్ర చికిత్సకు గురైంది" అన్నాను ఆ పేజీ తిప్పి చూపెడుతూ. అందులో 'కథ కాని కథ' ఫణి రచయితగా 'ఓ కథ కథ' పేరుతో పడింది.

"గుడ్‌గాడ్! మా కథలు ఇలా తారుమారైతే మీ బావ మల్లిక్ ఊరుకుంటాడా! వెంటనే సంపాదకుడికి ఫోన్ చేసి...."

"ఏమీ చెయ్యడు. తేలు కుట్టిన దొంగలాగ నోరు మూసుకూరుకుంటాడు. ఈ శృంగభంగంతో మన దగ్గిర సొంతడబ్బా కొట్టుకోడం మానేస్తాడు." అన్నాను.

"ఇదంతా నీ ఇంద్రజాలం అనుకుంటా. అసలు నేను రాసిన కథకు రచయితగా నాకు గుర్తింపు రాకుండా.."

"సారీ ఫణీ! నా ప్రయోగం తప్పయితే క్షమించు. రచయితల పేర్లూ కథల పేర్లూమారినా ఇది రెండు కథల మధ్య పోటీ. నీ కథే నెగ్గింది. నీదే విజయం. కంగ్రాట్స్!" అన్నాను గర్వంగా.

** రచన, డిసెంబరు, 2000*